ఈనాడు: May 27, 2017 (Page No. 20)

ఐఐఎం విశాఖ విద్యార్థులతో ఆచార్యులు, డైరెక్టర్, ఛైర్మన్ తదితరులు

నిన్నటి నైపుణ్యం రేపటికి పాతదే..

- ఐఐఎం ఛైర్మన్ హరిభర్తియా
- ఘనంగా మొదటి వార్షిక కోత్సవం
- విద్యార్థులకు పట్టాల ప్రదానం

పయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విశాఖపట్నం మొదటి స్నాతకోత్సవం శుక్రవారం బీచ్ రోడ్‌లోని ఓ హోటల్‌లో ఘనంగా జరిగింది. 2015 సెప్టెంబరులో కేంద్ర ప్రభుత్వం ఐఐఎం విశాఖపట్నంలో ఏర్పాటు చేయగా ఆంధ్రవిశ్వవిద్యాలయంలో తాత్కాలిక భవనాల్లో నిర్వహిస్తున్నారు. ఇందుకు అవసరమైన 230 ఎకరాల స్థలాన్ని గంభీరం వద్ద ప్రభుత్వం కేటాయించింది. ప్రపంచస్థాయి ప్రమాణాలతో కూడిన ప్రాంగణాన్ని ఆ స్థలంలో నిర్మిస్తున్నారు. ఈ తరుణంలో విశాఖ ఐఐఎంలో మేనేజ్‌మెంట్‌లో పీజీ డిప్లమో కోర్సు పూర్తి చేసిన మొదటి బ్యాచ్ విద్యార్థులకు ఐఐఎం ఛైర్మన్ హరి భర్తియా శుక్రవారం పట్టాలు ప్రదానం చేశారు. ఐఐఎం విశాఖలో మేనేజ్‌మెంట్ కోర్సులో 2015-17 విద్యా సంవత్సరానికి సంబంధించి అభిషేక్ గోయెల్, గణపతి సుబ్రహ్మణ్యం మొదటి, ద్వితీయ ర్యాంకులతో బంగారు పతకాలు కైవసం చేసుకున్నారు.

స్నాతకోత్సవంలో మాట్లాడుతున్న ఐఐఎం విశాఖ డైరెక్టర్ ఆచార్య చంద్రశేఖర్

మేనేజ్‌మెంట్‌లో పీజీ డిప్లమో పట్టాను ప్రదానం చేస్తున్న ఐఐఎం ఛైర్మన్ హరిభర్తియా

మొదటి ర్యాంకుతో బంగారు పతకం అందుకుంటున్న విద్యార్థి అభిషేక్ గోయెల్

19 రాష్ట్రాల విద్యార్థులు.. ఐఐఎం విశాఖపట్నంలో 19 రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు విద్యనభ్యసించారని ఐఐఎం ఛైర్మన్ హరిభర్తియా తెలిపారు. ఐఐఎం విశాఖ స్నాతకోత్సవాన్ని హరిభర్తియా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి పట్టాలను ప్రదానం చేశారు. బంగారు పతక విజేతలకు పతకాలను అందించారు. అయన మాట్లాడుతూ అన్ని రంగాల్లో సాంకేతిక పరిజ్ఞానం బాగా విస్తరించి 4వ పారిశ్రామిక విప్లవం వస్తోందని అన్నారు. వాణిజ్య రంగంలో అంతర్జాలం, బిగ్‌డాటా ప్రభావం అధికమన్నారు. నిన్నటి నైపుణ్యం రేపటికి పాతబడుతోందన్నారు. విద్యార్థులు నిరంతరాయంగా కొత్త ఆలోచనలు, ఆవిష్కరణలు, నైపుణ్యంతో ముందుండాలని సూచించారు. పిజ్జా వ్యాపారంలోనూ సాంకేతిక పరిజ్ఞానం ఉన్నత స్థాయిలో ఉందని పేర్కొంటూ.. ఓ పిజ్జా కంపెనీ ప్రధాన కేంద్రాన్ని సందర్శించగా అక్కడ కంప్యూటర్ ఎనలిస్టులు, నిపుణులు సాంకేతిక పరమైన సిబ్బంది 30 మంది వరకు ఉన్నారని పేర్కొన్నారు. అనంతరం మేనేజ్‌మెంట్ విద్యనభ్యసించిన విద్యార్థులను అభినందించి పట్టాలను ప్రదానం చేశారు. ఐఐఎం విశాఖ డైరెక్టర్ చంద్రశేఖర్, ఐఐఎం బెంగళూరు డైరెక్టర్ ఆచార్య జి.రఘురామ్ పాల్గొన్నారు.

ఐఐఎం విశాఖ డైరెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఐఐఎం విశాఖ విద్యార్థులు ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందుకున్నారన్నారు. ఐఐఎం బెంగళూరు, ఆంధ్ర విశ్వవిద్యాలయం, రాష్ట్ర ఉన్నత విద్యామండలి, రాష్ట్ర ప్రభుత్వాల సహకారం మరువలేనిదన్నారు. విద్యతోపాటు బ్యాంకింగ్, ఫైనాన్స్, ఐటీ, మార్కెటింగ్ తదితర కంపెనీల్లో విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని తెలిపారు. స్నాతకోత్సవంలో ఐఐఎం బెంగళూరు డైరెక్టర్ ఆచార్య జి.రఘురామ్, పలువురు ఆచార్యులు పాల్గొన్నారు.

కష్టపడి చదివాను: ఎంతో కష్టపడి చదివి మొదటి ర్యాంకు సాధించాను. రాత్రి 2, 3 గంటల వరకు చదివేవాడిని. మొదటి ర్యాంకు రావడం చాలా ఆనందంగా ఉంది. మెరుగైన బోధన, ఉత్తమ ఆచార్యుల వల్ల మంచి మార్కులు సాధించాను. సాంకేతిక రంగంలో రాణించాలని ఉంది.

–అభిషేక్ గోయెల్, దిల్లీ, మొదటి ర్యాంకర్

రెండు బంగారు పతకాలు: తమిళనాడు రాష్ట్రంలోని మధురకు చెందిన నేను ద్వితీయ ర్యాంకుతో బంగారు పతకంతోపాటు ఆల్ రౌండ్ ప్రతిభతో మరో బంగారు పతకం అందుకున్నాను. విద్యా పరంగానేకాక వివిధ అంశాలలో చూపిన ప్రతిభ కారణంగా రెండు పతకాలు వచ్చాయి. ఐఐఎం విశాఖలో చదవడాన్ని గర్వంగా భావిస్తున్నాను. ప్రాంగణ ఎంపికలో ప్రొడక్ట మేనేజర్ ఉద్యోగానికి ఎంపికయ్యాను.

–గణపతి సుబ్రహ్మణ్యం, ద్వితీయ ర్యాంకర్

అనుభవం లేకుండా..: ఎంబీఏకు తత్సమానమైన పీజీ డిప్లమో డిగ్రీని (పీజీడీఎం)ను ఐఐఎంలో చదివిన వారికి అందజేస్తారు. ఐఐఎంలో చేరడానికి ముందు నాకు పని అనుభవం లేదు. అన్ని రకాల సదుపాయాలు కల్పించారు. హైదరాబాద్‌కు చెందిన మెడిసిస్ కంపెనీలో అసిస్టెంట్ మేనేజర్ ఉద్యోగం సాధించాను. చాలా ఆనందంగా ఉంది. –బి.వెంకట్ నరేంద్ర, ఐఐఎం విద్యార్థి

ఎంతో కష్టపడి సాధించిన సీటు: ఐఐఎం విశాఖలో చదవడానికి ఎంతో కష్టపడి సీటు సాధించాను. కోర్సు పూర్తి చేసే నాటికే మంచి కంపెనీలో సహాయ మేనేజర్ ఉద్యోగం పొందాను. మొదటి బ్యాచ్ అయినా మెరుగైన బోధన, వసతులు తదితర సదుపాయాలతో ఐఐఎం విశాఖ ముందు వరుసలో ఉంది.

–విశాల్, హైదరాబాద్, ఐఐఎం విద్యార్థి

ఏదైనా కంపెనీలో ఉన్నత స్థానం..: ఏదైనా కంపెనీలో ఉన్నత స్థానం సాధించాలన్నది నా లక్ష్యం. బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగాల్లో ఆసక్తి ఉంది. ఇప్పటికే కాగ్నిజెంట్ కంపెనీలో ఉద్యోగం సాధించాను. చాలా ఆనందంగా ఉంది. విశాఖ ఐఐఎంలో మొదటి బ్యాచ్ విద్యార్థిగా గర్వపడుతున్నా. –సౌరబ్ కంవన్, యూపీ, యూపీ

ముంబయి నుంచి వచ్చి..: ముంబయికి చెందిన నేను విశాఖ ఐఐఎంలో మేనేజ్‌మెంట్ కోర్సు పూర్తి చేశాను. తొలి స్నాతకోత్సవంలో మొదటి బ్యాచ్ విద్యార్థిని కావడం ఆనందంగా ఉంది. చార్టర్డ్ అకౌంటెంట్ విభాగంలో నాకు ఆసక్తి.

–ప్రియాంక మెహతా

FURNITURE WORLD
Since 1957